క్లుప్తంగా

ఘనంగా జానపద దినోత్సవం

పీలేరు : స్థానిక దివ్య యోగా కేంద్రంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని మంళవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మాట నుంచి పాట ఉద్భవిస్తే మాటకు సంగీతం జత కలసి కళగా రూపాంతం చెందిందన్నారు. ముందు తరాల శ్రామిక జీవనం , కష్ట జీవులు రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరి వారి అలసట తీర్చి వారికి స్వాంతన చేకూర్చే కళారూపాలే జానపదాలు అన్నారు. అనంతరం జానపద ప్రదర్శనలు నిర్వహించారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకొని రాయచోటిలో ఆయన అభిమానులు రక్తదానం చేశారు. చిరంజీవి వీరాభిమాని సంపత్‌కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం దీప బ్లడ్ బ్యాంక్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. శిబిరంలో రక్తదానం చేసి వారిని నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అల్లావుద్దీన్, మహమ్మద్, షేక్ ఖాదర్‌వలి, అసాద్, నవాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో నా భూమి - నా దేశం



మొక్కలు నాటుతున్న టీచర్లు, విద్యార్థులు

రామాపురం : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం నా భూమి - నా దేశం కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అటవీశాఖ నర్సరీ నుంచి వచ్చిన మొక్కలు, పండ్ల మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిట్వేలి : ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని చిట్వేలి, పెనగలూరు మండలాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ రాజేశ్వరి తెలియజేశారు. చిట్వేలి మండలంలోని మైలపల్లి పంచాయతీలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ పోస్టుకు ఎస్టీలు, పెనగలూరు మండలంలోని కట్టావారిపల్లి, ఇండ్లూరు అంగన్‌వాడీ కేంద్రాలలో ఓసీ జనరల్, అలాగే ఓబిలి హెచ్‌డబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రం ఎస్సీలు దరఖాస్తు చేయడానికి అర్హులన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డులు, ఓటరుకార్డు, పదో తరగతి మార్కు లిస్టులను చిట్వేలి ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సీడీపీఓ రాజేశ్వరి కోరారు.

హరిత రాయబారులకు జీతాలు చెల్లించండి

రామాపురం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హరిత రాయబారులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను సర్పంచ్‌లతో సంప్రదించి పంచాయతీ కార్యదర్శులు జీతాలు చెల్లించాలని ఎంపీడీఓ హైదర్‌వలి తెలియజేశారు. మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని సచివాలయం సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 10.30గంటలకు బయోమెట్రిక్‌కు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ప్రతి శుక్ర, శని వారాల్లో సర్వీస్ అమౌంటును చలనా రూపంలో కట్టాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు పెండింగ్ ఉన్న వెల్ఫేర్ స్కీంలు అన్నింటికీ ఈకేవైసీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం

పీలేరు రూరల్ : మండలంలోని ఎర్రగుంట్లపల్లె పంచాయతీ నెట్టిబండ సమీపంలోని ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీన పరచుకున్నారు. తహసీల్దార్ ధనుంజయలు ఆదేశాల మేరకు వీఆర్వో యోగ, సర్వేయర్ రెడ్డెప్ప స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి నిర్మాణం కోసం గుణాంతాలు తవ్వడం గుర్తించారు. సర్వే నెంబరు 745లో ఐదెకరాల అనాదీనం భూమి ఉందని, ఈ స్థలంలో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

29న వాహనాల వేలం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 29వ తేదీన వేలం వేయనున్నట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ గూడ్స్ వెహికల్స్ 26, ఆటోరిక్షాలు 22, మోటార్ సైకిళ్లు 75 వేలం వేసేందుకు రవాణాశాఖ నోటీసులు జారీ చేసిందన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ. 5000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

- చంద్రబాబును ప్రజలు నమ్మే రోజులు పోయాయి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



ఓబులవారిపల్లె: లబ్ధిదారుకు సంక్షేమాన్ని తెలియజేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల



రైల్వేకోడూరు అర్బన్: జాతరలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న కొరముట్ల

ఓబులవారిపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే అదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం బొమ్మవరం సచివాలయ పరిధిలోని గద్దల రేవుపల్లె, దళితవాడ, ఎస్టీ కాలనీ, శేశక్కగారిపల్లె, కాల్వా హరిజనవాడ గ్రామాలలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి అధికారులు, నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొరముట్లకు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రజలకు ప్రభుత్వం ద్వార అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క కుటుంబానికి ఏదో రకంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు అగచాట్లు పడ్డారని, జన్మభూమి కమిటీ పేరుతో తన పార్టీ వారికే లబ్ధి చేకూర్చారన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో వెయ్యి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజలకు వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. చంద్రబాబును నమ్మే రోజులు పోయాయని తెలియజేశారు. కాగా ఆయా గ్రామాలలో ప్రజలు విద్యుత్, రోడ్లు, పింఛన్‌లు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు దృష్టికి తీసుకొని వచ్చారు. వెంటనే ఆయన స్పందించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయరావు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, సర్పంచ్‌లు నరేంద్రరాజు, మల్లెం ఈశ్వరయ్య, ఎంపీటీసీలు పైడి గిరినాయుడు, రమేష్‌రాజు, రైల్వేకోడూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గిరిజమ్మ, స్థానిక నాయకులు రెడ్డియ్య, నాగిశెట్టి రవికూమార్, సురేంద్ర, ప్రభాకర్, పాండురంగయ్య, సుబ్రమణ్యం నాయుడు, ఏపీఎం ఆర్ముగం, ఆర్ఐ రామ్మోహన్‌నాయుడు అన్ని శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మంగంపేట దళితవాడ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మండగలం ప్రభావతికి మంగళవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు. ప్రభావతి మృతి పట్ల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

గంగమ్మ జాతరలో పాల్గొన్న ప్రభుత్వవిప్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట హరిజనవాడలో మంగళవారం ఘనంగా గంగమ్మ జాతరను స్థానికులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఏటా గంగమ్మకు ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి జాతరను నిర్వహించుకోవడం ఎంతో శుభపరిణామమన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే ఉదయం పంజం సుకుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, గుంటిమడుగు సుధాకర్ రాజు, ఆర్‌వీ రమణ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



యువతకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మహమ్మద్ రఫీ

రాయచోటి టౌన్ : యువత ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలుంటాయని ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ హెచ్చరించారు. రాయచోటి పట్టణంలో గురువారం నిబంధనలు పాటించకుండా బైక్ డ్రైవ్ చేస్తున్న వారికి మంగళవారం ఆయన ట్రాఫిక్ పోపోలీస్ స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ నిర్వహించారు. సిగ్నల్ పడినప్పుడు బండి ఆపకుండా నడిపినా, ఇరుకు సందుల్లో వేగంగా వెళ్లినా, మద్యం సేవించి వాహనం నడిపినా ప్రమాదాలను కొని తెచ్చుకున్నంటేనని తెలియజేశారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే మీతో పాటు ఎదుటివారికి ప్రాణాలకు నష్టం కలిగించిన వారమవుతామన్నారు. లైసెన్స్‌లు లేకుండా నడిపినా, సెల్ ఫోన్ మాట్లాడుతూ నడిపినా, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపినా, మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జోసెఫ్, మనోహర్, ఖదీర్, శేఖర్, అజీజ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఈ – పంట నమోదు తప్పనిసరి



రికార్డులను తనిఖీ చేస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజా

సిద్దవటం : ఖరీఫ్ 2023లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు అన్నీ రకాల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల కోసం ఈ - పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని బద్వేల్ ఏడీఏ నాగరాజా తెలిపారు. మండలంలోని టక్కోలి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం వ్యసాయాధికారి రమేష్‌రెడ్డితో కలిసి ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టర్‌లను తనిఖీ చేసి, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లడుతూ ఖాజీపల్లెలో ఈ - పంట నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించమన్నారు. ఈ - పంట నమోదు ఇప్పటి వరకు 70 ఎకరాలకు పైగా పూర్తయిందన్నారు. ఇంకా 300 ఎకరాలకు పైగా చేయాల్సి ఉందన్నారు. నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆర్బీకే సిబ్బందికి ఆదేశించినట్టు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా, విమర్శలకు తావు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఈ - పంటను నమోదు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్నీ రకాల ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పంటలో చీడ, పీడలను గుర్తిస్తే వెంటనే ఆర్బీకే సహాయకులను, మండల వ్యవసాయాధికారిని సంప్రదించి ఆలస్యం చేయకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కాండం తొలుచు పురుగు, ఆకుముడత, దోమపోటు వరి పంటను ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు, సుస్థిర భూసార సంరక్షణకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి, ఆర్బీకే సహాయలకులు ఎ. వంశీ, శివఫణీంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల విముక్తికి 'ముస్కాన్'



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : వీధి బాలలు, బాల కార్మికుల విముక్తికి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా చిట్వేలి మేధర వీధి, కుమ్మరపల్లి వీధులలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్‌పై మంగళవారం, బుధవారాలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మంగళవారం దుకాణంలో పనిచేస్తున్న 16 సంవత్సరాలు వయస్సు ఉన్న బాలురను గుర్తించినట్లు సీడీపీఓ రాజేశ్వరి తెలిపారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువుకోలేని వారి కోసం ప్రభుత్వం హోమ్స్ నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాజేశ్వరి కోరారు. కార్యక్రమంలో చిట్వేలి ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుందరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, గ్రేడ్-2 సూపర్‌వైజర్ రేఖారాణి, పోలీసు సిబ్బంది రాధిక, రాజేష్, అంగన్‌వాడీ వర్కర్లు సుజాత, కుమారి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం





పూజలందుకున్న మంగళగౌరి అమ్మవారు, మంగళగౌరి వత్రంలో పాల్గొన్న మహిళలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన మంగళగౌరీ సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస తొలి మంగళవారం సందర్భంగా మంగళ గౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గణపతిపూజ, గణపతి హోమం, నవగ్రహ శాంతి, ప్రత్యంగిరి హోమం జరిపారు. అలానే అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. మాధవరం-1 చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన మహిళలందరితో సంప్రదాయ బద్ధంగా సామూహిక మంగళగౌరీ వ్రతాన్ని చేయించారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలలో 2023 ఏప్రిల్‌లో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎం)కు 8వ తరగతి విద్యార్థులు షణ్ముఖరాయల్, కీర్తనలు ఎంపిక కాగా వీరికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏటా ఇంటర్మీడియట్ వరకు రూ. 12 వేలు ప్రభుత్వం అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఏదైనా సాధించవచ్చని, ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీనాయక్, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేటకు చేరుకున్న మంత్రి కాకాని



జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నేతలు

రాజంపేట : అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి రాజంపేటలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. మంత్రి మేడా భవన్‌కు చేరుకున్న సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రిని మండలాల వారీగా నేతలు శాలువాలు కప్పి సన్మానించారు. పేరుపేరున నాయకులును కాకానికి ఎమ్మెల్యే మేడా పరిచయం చేశారు.

నేడు రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల అభివృద్ధిపై సమావేశం

బుధవారం స్థానిక ఆర్డీఓ సభా భవనంలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జున రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాధరెడ్డిలు పాల్గొంటారు. అలానే కలెక్టర్, అధికారులు హాజరుకానున్నారు.


శాస్త్రీయ సమాజ నిర్మాణమే జేవీవీ ధ్యేయం



కరపత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, సభ్యులు

రాయచోటి అర్బన్ : మూఢ నమ్మకాలు లేని సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక ధ్యేయమని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో జరిగిన జేవీవీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు చంద్రయాన్-3 జాబిల్లిని చేరుతుంటే మరోవైపు సైన్స్ వ్యతిరేక శక్తులు అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాయంటూ తెలిపారు. సైన్స్ ఇప్పటికీ పాఠ్య గ్రంథాల్లో ఉందేకాని జీవన విధానంగా మారలేదన్నారు. తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద ప్రజా సైన్స్ ఉద్యమ సంస్థగా జన విజ్ఞాన వేదిక ప్రజలలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పిల్లల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి ప్రతి యేడాది చెకుముకి సైన్స్ సంబరాలను, వేసవిలో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు కూల్ డ్రింక్స్ వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టామని, ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలంటూ కోరారు. అనంతరం మూఢ నమ్మకాలు లేని సమాజం కోసం పోరాడిన గొప్పహేతువాది, డాక్టర్, రచయిత సామాజిక ఉద్యమనేత నరేంద్ర అచ్యుత్ దభోల్కర్ కరపత్రాన్ని ఆయన జేవీవీ సభ్యులతో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు హరీంద్రనాథవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు, రామయ్య, శివయ్య, ప్రభుచరణ్, రవీంద్రనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



వాల్ పోస్టర్‌లను విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : ఉద్యోగుల ప్రయోజనాలకు తీరని విఘాతాన్ని కలిగిస్తున్న సీపీఎస్ వద్దని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు డీఈఓ కార్యాలయం ఎదుట చలో విజయవాడ వై నాట్ ఓపీఎస్ అంటూ ముద్రించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను తొలగించి దాని స్థానంలో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామంటూ పాలకులు హామీ ఇచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా అది ఆచరణకు నోచుకోకపోవడం దారుణమన్నారు. సీపీఎస్‌ను ప్రభుత్వం రద్దు చేయకపోగా దాని స్థానంలో జీపీఎస్‌ను తీసుకువస్తామంటూ పాలకులు చెప్పడం తగదన్నారు. సెప్టెంబరు 1వ తేదీలోపు సీపీఎస్‌ను రద్దు చేయకపోతే లక్షలాది మందితో విజయవాడలో వై నాట్ ఓపీఎస్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు.

వర్షం కోసం గ్రామస్తుల పూజలు



పూజలు చేస్తున్న సరస్వతిపల్లె గ్రామ ప్రజలు

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె గ్రామ శివార్లలో వెలసిన శివాలయంలో మంగళవారం శివుడు, అయ్యప్ప స్వాములకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే ఉపవాసంతో ఆలయం వద్దకు చేరుకొని వేద పండితుల చేత శివుడికి, అయ్యప్ప స్వాములకు పూజలు, అభిషేకాలు, భజనలు చేశారు. తమ పంటలు సాగు చేసుకోవాలన్న వర్షాలు లేక భూములు ఎండిపోతున్నాయని దేవుని ప్రార్థించారు. గత ఏడాదిలో కురిసిన వర్షాలకు ఈ సమయానికే పంట సాగు చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షం పడకపోవడంతో భూములు బీడుగా మారుతున్నాయన్నారు. దేవుడు ఇప్పటికైనా కనికరించి వర్షం కురిస్తే పంట పొలాలను సంతోషంగా సాగు చేసుకుంటామని ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో చెన్నూరు బాబు, పెంచలయ్య, మెకానిక్ రమణ, మల్లికార్జునరెడ్డి, నాగరాజు, నరసింహులు, మహిళలు పెద్ద ఎత్తున ఆలయం చేరుకొని పూజలు ఘనంగా నిర్వహించారు.

కట్టావారిపల్లి బస్సును కోడూరుకు పొడిగించండి

పెనగలూరు : కట్టావారిపల్లి బస్సును ఉదయం పూట కోడూరు వరకు పొడిగించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కస్తూరి కృష్ణమనాయుడు తెలిపారు. ఈ బస్సును పొడిగించాలని రాజంపేట డీఎం, ఆర్ఎంలను కోరినట్లు వారు తెలిపారు. ఉదయం వేళ విద్యార్థులతోపాటు గ్రామ ప్రజలు చిట్వేలి, కోడూరుకు వెళ్లాలంటే ఈ బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిట్వేలికి వెళ్లాలంటే ప్రతిరోజూ ఆటోలలో వెళ్లాల్సి వస్తుందన్నారు. కట్టావారిపల్లి మీదుగా కోడూరుకు వెళ్లి తిరిగి ఇదే రూటులో రాజంపేటకు బస్సు వెళ్లినట్లైతే టికెట్లు కూడా అధికంగా వస్తాయని చెప్పారు. అధికారులు ఈ విషయంపై ఆలోచించి అందరికీ ఉపయోగపడేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల, బ్రెడ్లు పంపిణీ చేశారు. మంగళవారం రాయచోటి శ్రీ మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డాక్టర్ అబ్దుల్ కలాం, యువ కెరటం ట్రస్టు డైరెక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని సమాజం కోసం కొంత సమయంతోపాటు డబ్బును కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్‌రెడ్డి, నవీన్, పవన్‌కుమార్, మంజు, మహేష్, బాబులు, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్వమిత్వా గ్రామాలకు మ్యాపులు మంజూరు



ఈఓపీఆర్‌డీ ఉషారాణి

రామాపురం : శ్వమిత్వా కార్యక్రమంలో భాగంగా తొమ్మిది గ్రామాలకు మ్యాపులు మంజూరైనట్లు ఉషారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటింటికి కొలతలు వేసి 13వ నోటిఫికేషన్ ఇచ్చి ప్రాపర్టీ కార్డు ప్రజలకు ఇస్తామన్నారు. దీనికి సంబంధించి ప్రతి కార్యదర్శి ఇంటింటికి వెళ్లి ప్రజలతో సమన్వయమై వారి ఇంటికి కొలతలు వేసిన తరువాత ప్రాపర్టీ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఇప్పటికే గువ్వలచెరువు గ్రామంలో సర్వే పూర్తి చేశామన్నారు. అలానే నీలకంఠరావుపేట, సరస్వతిపల్లె, సుద్దమళ్ల, కల్పనాయినిచెరువు, నల్లగుట్టపల్లి, చిట్లూరు, హసనాపురం, బండపల్లి, కుమ్మరపల్లి గ్రామాలకు సర్వే మ్యాప్‌లో వచ్చాయని సిబ్బంది గ్రామాలలో సిబ్బంది పర్యటిస్తారన్నారు. రాచపల్లి, గోపగుడిపల్లె, కసిరెడ్డిగారిపల్లె గ్రామాలకు సంబంధించిన మ్యాపులు అందాల్సి ఉందన్నారు. కార్యక్రమాన్ని 15, 20 రోజుల్లో కార్యదర్శులు పూర్తి సర్వే చేయాలని సూచించారు.

ఘన జీవామృతమే ఘనమైన ఎరువు



ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న దృశ్యం

గాలివీడు : మండలంలోని గోరాన్‌చెరువు క్లస్టర్‌లో మాస్టర్ ట్రైనర్ రామయ్య, మోడల్ మేకర్ సరస్వతి ఆధ్వర్యంలో 400 కేజీల ఘన జీవామృతాన్ని తయారు చేశారు. ఘన జీవామృతం తయారీ విధానం దాని వల్ల ఉపయోగం ఏమిటీ అనేది వారు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ ఘన జీవామృతం తయారీ విధానం, నాటు ఆవు పేడ, బెల్లం, పప్పుదినుసుల పిండి, పుట్ట మన్ను, ఆవు పంచిగం ఉపయోగించి ఘన జీవామృతాన్ని తయారు చేయవచ్చు అని తెలియజేశారు. ఈ ఘన జీవామృతాన్ని చివరి దుక్కిలో వేయడం వలన భూమి సారసవంతమై భూమిలోని సూక్ష్మజీవులను చైతన్య పరిచి సాగుకు దోహదం చేస్తుందన్నారు. రైతులు ఈ విధానాన్ని అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్‌లు నాగరాజు, యశోద, ఐసీఆర్పీలు గంగాదేవి, పరమేశ్వరి, నాగేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

వీఆర్ఓ, బీఎల్ఓలకు అభినందన



అధికారులతో సమావేశమైన తహసీల్దార్

పుల్లంపేట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీఆర్ఓలతో తహసీల్దార్ నరసింహకుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు పూర్తి చేసినందుకు తహసీల్దార్ వారిని అభినందించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి మండలానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, వీఆర్ఓలు మల్లికార్జున, రాధమ్మ, ధనమ్మ, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.